సాక్షి
అనంతపురం

సోమవారం ׀ 4 ׀ నవంబర్ ׀ 2024



హనుమా.. ఇక్కట్లు కనుమా

నెట్టికంటి ఆంజనేయ స్వామి కొలువైన కసాపురం పుణ్యక్షేత్రంలో వసతుల లేమితో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

8లో



మహిళా సంఘాలకు టీడీపీ సభ్యత్వం!

అనంతపురంలో మహిళా సంఘాల సభ్యులు టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని ప్రజాప్రతినిధి అల్టిమేటం జారీ చేసినట్లు తెలిసింది.

8లో

గరిష్టం/కనిష్టం
35.6°/21.2°

జిల్లా అంతటా ఆదివారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

అయ్యో బాబోయ్.. అపార్



ఈ విద్యార్థి పేరు జి.సదాశివ. నార్పల మండలం గంగనపల్లి గ్రామం. పుట్లూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. 'అపార్' గుర్తింపు కార్డు కోసం ఆధార్ కార్డు కావాలని ఉపాధ్యాయులు చెప్పగా సదాశివ తీసుకెళ్లాడు. అందులో అతని ఇంటి పేరు పూర్తిగా లేకపోవడంతో ఆధార్ సెంటర్‌కు వెళ్లి మార్పించుకోవాలని సూచించారు. తండ్రితో కలిసి సదాశివ ఆధార్ సెంటర్‌కు వెళ్తే జనన ధ్రువీకరణ పత్రం ఉంటేనే మార్చేందుకు వీలవుతుందని నిర్వాహకులు చెప్పారు. దీంతో జనన ధ్రువీకరణ పత్రం కోసం వారు అగచాట్లు పడుతున్నారు. సదాశివ ఒక్కడే కాదు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రస్తుతం ఇదే సమస్య ఎదుర్కొంటున్నారు. కూలీనాలి చేసుకుని జీవనం సాగించే సామాన్యులు ఆధార్ కేంద్రాల వద్దకు పరుగులు తీస్తున్నారు.

- కొత్త కష్టాలు తెచ్చిపెట్టిన అపార్ ప్రక్రియ
- 'ఆధార్'లో వివరాల మార్పుకోసం విద్యార్థుల తల్లిదండ్రుల అవస్థలు
- టీచర్లకూ తలనొప్పులు
- జనన ధ్రువీకరణ పత్రం కావాలంటున్న 'ఆధార్' నిర్వాహకులు
- రాష్ట్రంలో చివరిస్థానంలో నిలిచిన జిల్లా
- ఎంఈఓలు, హెచ్ఎంలపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్న ప్రభుత్వం

అనంతపురం ఎడ్యుకేషన్/పుట్లూరు: నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా విద్యార్థులకు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో జీవితకాల గుర్తింపు కార్డు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు 'వన్ నేషన్ - వన్ ఐడీ' కార్డు అందుబాటులోకి తెస్తోంది. జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి ఒక నంబర్ కేటాయించి, మార్కులు, గ్రేడ్లు, ఉపకార వేతనాల వివరాలు, క్రీడలు, ఇతర అంశాల్లో సాధించిన వివరాలను నిక్షిప్తం చేయనున్నారు. ఇంత వరకూ బాగానే ఉన్నా, రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి విద్యార్థులకు తీవ్ర అడ్డంకులు ఎదురవుతున్నాయి. పాఠశాలలో ఉన్న వివరాల ఆధారంగా కాకుండా ఆధార్‌లో నమోదైన వివరాల ఆధారంగా జనరేట్ అవుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తప్పనిసరిగా పాఠశాలలో ఉన్న పేరు, పుట్టిన తేదీ వివరాలు ఆధార్‌లో నమోదు చేయించుకోవాలని పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తుండటం పెద్ద తలనొప్పిగా మారింది.



రాప్తాడు మోడల్ స్కూల్

జనన ధ్రువీకరణ పత్రాల కోసం ఇక్కట్లు..

ఆధార్‌లో తప్పులను సవరించుకోవడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు జనన ధ్రువీకరణ పత్రాల కోసం అగచాట్లు పడుతున్నారు. గతంలో మంజూరు చేసిన జనన ధ్రువీకరణ పత్రాలు ఉన్నా అందులో తప్పుల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు రెవెన్యూ కార్యాలయాల ద్వారా జనన ధ్రువీకరణ పత్రాలు పొందగా, వాటిలో వివరాలు చేతిరాతతో ఉన్నందున ఆధార్ వివరాల మార్పునకు అంగీకరించడం లేదు.



పాఠశాల రికార్డులకు పాతర ..

అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలంటూ ఎంఈఓలు, హెచ్ఎంలపై ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి చేస్తోంది. దీంతో చాలామంది ఎంఈఓలు, హెచ్ఎంలు పాఠశాల రికార్డులకు పాతరేస్తున్నారు. విద్యార్థుల వివరాలు స్కూల్ రికార్డులు, యూడైస్, అపార్ మూడింట్లోనూ ఒకేవిధంగా ఉండాలి. గతంలో ఆధార్‌కార్డు నమోదు చేసిన సమయంలో తప్పుల తడకగా చేయడం వల్ల చాలామంది విద్యార్థుల పేర్లు, ఇంటిపేర్లు, పుట్టినతేదీ వివరాలు పాఠశాలలోని రికార్డులతో సరిపోవడం లేదు. 'యూడైస్' ఎడిట్ ఆప్షన్ ఎంఈఓలు, హెచ్ఎంలకు ఉంటుంది. ఈ క్రమంలో ఆధార్‌కార్డులో ఉన్న వివరాల ప్రకారం 'యూడైస్'లో ఎడిట్ చేసేసి మమ అనిపిస్తున్నారు. భవిష్యత్తులో పాఠశాల రికార్డులు, హడావుడిగా సృష్టిస్తున్న 'అపార్' కార్డులకు పొంతన లేకపోతే నష్టం ఎవరికి? బాధ్యులెవరు? అని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికే 'అపార్' పూర్తయిన స్కూళ్లలో 'యూడైస్'లో ఎడిట్ చేసి పూర్తి చేసినట్లుగా తెలిసింది.

జిల్లాలో మొత్తం స్కూళ్లు	2,416
1-10 తరగతుల విద్యార్థుల సంఖ్య	3,71,484
ఇప్పటిదాకా 'అపార్' పూర్తయిన విద్యార్థుల సంఖ్య	1,50,147
'అపార్' రిజిస్ట్రేషన్‌లో రాష్ట్రంలో జిల్లా స్థానం	చివరి

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



విద్యార్థుల ఆధార్‌లో వివరాల మార్పునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. జనన ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన అందించడంతో పాటు విద్యార్థులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి. ప్రతి పాఠశాలలో ఆధార్ అప్‌డేట్ కోసం మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

– సూరి, విద్యార్థి తండ్రి, కడవకల్లు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



విద్యార్థులకు 'అపార్' కీలకం. 'ఒన్ నేషన్– ఒన్ నంబర్' అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్లు ప్రత్యేక దృష్టి సారించారు. ఆధార్ కార్డులు, స్కూల్‌రికార్డుల వివరాలకు పొంతన లేకపోవడంతో ఆలస్యమవుతోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఎం.ప్రసాద్‌బాబు, డీఈఓ

టీడీపీ నీచ రాజకీయం

- వ్యక్తిగత కారణాలతో యువకుడి ఆత్మహత్యాయత్నం
- వైఎస్సార్‌సీపీ నాయకులపై నెపం నెట్టే ప్రయత్నం

పుట్టపర్తి: టీడీపీ నాయకులు నీచ రాజకీయానికి తెరలేపారు. వ్యక్తిగత కారణాలతో యువకుడు ఆత్మహత్యాయత్నం చేస్తే.. వైఎస్సార్‌సీపీ నేతలు ఇందుకు కారణమని బాధితుడి చేత చెప్పించే ప్రయత్నం చేశారు. గ్రామంలో తమకు ఎదురులేకుండా చేసుకునేందుకు ఏమాత్రమూ సంబంధం లేని విషయంలో వైఎస్సార్‌సీపీ నాయకులను ఇరికించేందుకు మూడు నెలల కిందట జరిగిన చిన్నపాటి గొడవను సాకుగా చూపి పన్నిన కుట్ర గురించి తెలుసుకున్న జనం టీడీపీ నాయకుల తీరును అసహ్యించుకుంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం మారాల గ్రామంలో టీడీపీకి చెందిన మేకల నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామమోహన్, గోపి వర్గాల మధ్య మొహర్రం పండుగ వేళ ఇంటి వద్ద దారి విషయమై చిన్నపాటి గొడవ జరిగింది. ఆ తర్వాత ఎవరికి వారు మిన్నకుండిపోయారు. గ్రామంలో అందరితోనూ సఖ్యతతో ఉంటూ వస్తున్నారు.

ఆత్మహత్యాయత్నాన్ని రాజకీయం చేసి..

మారాల గ్రామానికి చెందిన మేకల నారాయణ స్వామి కుమారుడు గౌతమ్ పుట్టపర్తిలో ఉంటూ అప్పుడప్పుడూ స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి గ్రామంలోని తమ ఇంట్లోనే శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి మంటలు ఆర్పి బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదు. గౌతమ్ ఆత్మహత్యాయత్నానికి కారణం ప్రేమ వ్యవహారమని స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే, గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులను అణచివేయాలన్న ఉద్దేశంతో గౌతమ్ ఆత్మహత్యాయత్నాన్ని టీడీపీ నాయకులు రాజకీయం చేసేందుకు కుట్ర పన్నారు. మూడు నెలల కిందట జరిగిన గొడవకు సంబంధించిన విషయంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్తుంటే భయభ్రాంతులకు గురి చేశారని, అందుకే తాను ఆత్మహత్యాయత్నం చేసుకున్నానని బాధితుడి చేత చెప్పించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. రాజకీయ లబ్ధి కోసం గ్రామంలో కక్షలు రేపే చర్యలకు స్వస్తి పలకాలని వైఎస్సార్‌సీపీ నాయకులు రామమోహన్, గోపి తదితరులు టీడీపీ నాయకులకు హితవు పలికారు.

న్యూస్‌రీల్

అట్టహాసంగా అంతర్ కళాశాలల క్రీడా పోటీలు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

గుంతకల్లు: స్థానిక శంకరనంద గిరిస్వామి డిగ్రీ కళాశాలలో ఆదివారం శ్రీ కృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా ఎస్కే యూనివర్సిటీ రెక్టార్ జి.వెంకటనాయుడు, శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి, ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ జెస్సీ హాజరై ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు అందుకోవచ్చన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని చెప్పారు. అనంతరం బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు గోపాల్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం మొదటి ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుడిని అర్చకులు బంగారు కవచంతో అలంకరించి ప్రత్యేక పంచామృతాభిషేకాలు, అర్చనలు గావించారు. ఆలయ ప్రాంగణంలో కుజదోష, కాల సర్పదోష, రాహుకేతు నివారణ పూజలతో పాటు స్వామి మూల మంత్ర బీజాక్షర హోమం చేపట్టారు. రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మంజునాథ స్వామి, పార్వతి దేవి అమ్మవారికి కూడా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో నిమ్మదొప్పల్లో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఇసుక అక్రమ తరలింపు అడ్డగింత





పి.జలాలపురం వద్ద వంకలో టీడీపీ నాయకులు ఇసుక తోడేసిన దృశ్యం, పోలీసులు పట్టుకున్న హిటాచీ

శింగనమల: మండలంలోని పి.జలాలపురం గ్రామ సమీపంలోని వంక నుంచి టీడీపీ నాయకులు అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్లను శనివారం రాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. అయితే, గ్రామస్తులపై పచ్చ పార్టీ నాయకులు ఎదురుతిరగడంతో స్థానికులు నేరుగా ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఎస్పీ ఆదేశాల మేరకు శింగనమల పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. వంకలో ఇసుక తోడుతున్న హిటాచీతో పాటు అక్కడే ఉన్న 5 టిప్పర్లను పట్టుకున్నారు. పోలీసులు గ్రామస్తులతో మాట్లాడుతుండగానే చీలేపల్లి దారి గుండా టిప్పర్లు వెళ్లిపోయాయి. దీంతో హిటాచీని పోలీసులు పట్టుకొని శింగనమల పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రోజూ రాత్రిళ్లు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్నారు. దీంతో భూగర్భ జలం తగ్గిపోతోందన్నారు. రాత్రిళ్లు ఇసుక టిప్పర్లు చేసే శబ్దాలతో నిద్ర కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాబు మాటలకు అర్థాలే వేరు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే మెట్టు, పార్టీ నేతలు

- రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు
- మహిళలు, చిన్నారులపై పెరిగిన అఘాయిత్యాలు
- కరువు మండలాల ప్రకటనలో జిల్లాకు తీవ్ర అన్యాయం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ ఎమ్మెల్యే మెట్టు ధ్వజం
- డైవర్షన్ పాలిటిక్స్ మాని 'సూపర్ సిక్స్' అమలు చేయాలని హితవు

రాయదుర్గం: సీఎం చంద్రబాబు మాటలకు అర్థాలే వేరు అన్నట్లు ఆయన పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి మండిపడ్డారు. పార్టీ జిల్లా అధ్యక్షుడి హోదాలో ఆదివారం తొలిసారి రాయదుర్గం పట్టణానికి వచ్చిన ఆయనకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మెట్టు నివాసంలో విలేకరులతో అనంత మాట్లాడారు. 'ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తే పీడీ యాక్ట్ తెరుస్తాం..బెల్టు షాపు పెడితే కేసు నమోదు చేస్తాం' అంటూ చంద్రబాబు ఉపన్యాసాలిస్తే సరిపోదన్నారు. లోపల ఒకలా, బయట మరోలా డ్రామాలు ఆడటం మానుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ పేదలు, మహిళల సంక్షేమం దృష్ట్యా బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపితే, నేడు చంద్రబాబు రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చేశారన్నారు. నీరు సరిగా సరఫరా కాని గ్రామాల్లోనూ మద్యం ఏరులై పారిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేల ప్రమేయంతో ఊరూరా బెల్టుషాపులు పుట్టుకొచ్చాయన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తుండటంతో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు, రాజ్యాంగ వ్యవస్థలపై దాడి, మీడియాపై అణచివేత యథేచ్ఛగా కొనసాగుతోందన్నారు. మద్యం, గంజాయి కట్టడి చేయకపోవడంతో హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ మాని 'సూపర్ సిక్స్' హామీలు అమలు చేయాలని హితవు పలికారు.

బాబే సమాధానం చెప్పాలి..

చిత్తూరు జిల్లా పుంగనూరులో చిన్నారి హత్య ఘటన మరువకముందే తిరుపతి జిల్లా వడమాలపేటలో మరో దారుణం వెలుగు చూసిందని మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి అన్నారు. ఆదోనిలో పదో తరగతి విద్యార్థి మద్యం సేవించి పాఠశాలకు వెళ్లడం, తిరుపతిలో ఓ పసిబిడ్డ 'ఇంటికి రా నాన్నా అమ్మ ఏడుస్తోంది.. ఆకలవుతోంది' అంటూ.. తప్పతాగి రోడ్డుపై పడ్డ తండ్రిని ఫోన్‌లో పిలవటం చూసి బాధేస్తోందన్నారు. ఇలాంటి వారందరికీ చంద్రబాబే సమాధానం చెప్పాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 130 రోజుల్లోనే 130కి పైగా అత్యాచారాలు జరిగి ఉంటాయన్నారు. జిల్లా అంతటా కరువు కరాళ నృత్యం చేస్తున్నా పాలకులకు కనిపించకపోవడం దుర్మార్గమని, కేవలం ఏడు మండలాలను కరువు జాబితాలో చేర్చి చేతులు దులుపుకోవడం అన్యాయమన్నారు.

అండగా ఉంటాం..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు కలసికట్టుగా కృషి చేద్దామని శ్రేణులకు అనంత, మెట్టు పిలుపునిచ్చారు. అధైర్య పడాల్సిన పనిలేదని, అన్ని వేళల్లోనూ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొని ఉపేంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరు రాజగోపాల్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ ఉషారాణి, జిల్లా కార్యదర్శి మాధవరెడ్డి, నాయకులు ఎర్రగుంట కేశవరెడ్డి, రాజ్‌కుమార్, బోర్‌వెల్ ఆనందరెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, పైనేటి తిమ్మప్ప, సర్పంచులు సుదర్శనరెడ్డి, పరమేశ్, ఉమేష్‌రెడ్డి, బొమ్మనహాళ్, కణేకల్లు మండల కన్వీనర్లు రామాంజినేయులు, ఆలూరు చిక్కన్న, కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి, మెకానిక్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి విక్రేత అరెస్ట్

గుంతకల్లుటౌన్: స్థానిక షికారీ కాలనీలో గంజాయి విక్రయిస్తూ వన్‌టౌన్ పోలీసులకు షికారీ అంజిని అలియాస్ అంజి పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి ఒక కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మనోహర్ తెలిపారు. కర్ణాటకలోని బళ్లారిలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేసిన అంజి... దానిని 5 గ్రాముల చొప్పున ప్యాకెట్లు చేసి ఒక్కో కవర్‌ను రూ.150కి విక్రయిస్తున్నాడు. అందిన పక్కా సమాచారంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసులు అంజిని ఆయన ఇంటి వద్దనే అరెస్ట్ చేశారు.

చిల్లర కొట్టులోకి దూసుకెళ్లిన కారు



రాయదుర్గం టౌన్: స్థానిక కేటీఎస్ డిగ్రీ కళాశాల వద్ద వైఎస్సార్ సర్కిల్‌లో రోడ్డు పక్కన ఉన్న చిల్లరకొట్టులోకి ఓ కారు దూసుకెళ్లింది. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ఆరుగురు యువకులు కారులో ప్రయాణిస్తూ ప్రమాదానికి కారణమైనట్లుగా కొట్టు యజమాని మాంతేష్ తెలిపారు. ప్రమాదంలో షెడ్డు మొత్తం దెబ్బతినడంతో దాదాపు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. కాగా, కారులో ఉన్న యువకులకూ స్వల్ప గాయాలయ్యాయి. పట్టణంలోని చిందనూరు కల్యాణ మంటపంలో జరిగిన ఓ వివాహ వేడుకకు అనంతపురం నుంచి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ముద్ద చర్మ వ్యాధితో పాడి ఆవు మృతి

అగళి: ముద్దు చర్మ వ్యాధి సోకి ఓ పాడి ఆవు మృతి చెందింది. అగళి మండలం కరిదాసనపల్లి గొల్లహట్టిలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు రాజప్ప పాడి పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ముద్దచర్మ వ్యాధితో బాధపడుతున్న తన పాడి ఆవుకు చికిత్స చేయించాడు. మూడు రోజుల తర్వాత ఆదివారం ఆవు మృతి చెందింది. గ్రామంలో ఇప్పటి వరకూ వ్యాధి నివారణ టీకాలు వేయలేదని, దీంతో పాడి రైతులు నష్టపోయాల్సి వస్తోందని ఈ సందర్భంగా రాజప్ప ఆవేదన వ్యక్తం చేశారు.

ఉచిత గ్యాస్ ఉత్తిదే..

- జిల్లాలో 2.59 లక్షల మందికి మొండిచెయ్యి

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గ్యాస్ పథకం జిల్లాలో 2,59,415 మంది వినియోగదారులకు అందడం లేదు. పౌర సరఫరాల శాఖ ప్రకటించిన లెక్కలు ఈ విషయాన్ని చెబుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 50 ఏజెన్సీల పరిధిలో గృహావసర (డొమెస్టింగ్) గ్యాస్ కనెక్షన్లు 7,65,246 ఉన్నాయి. ఇందులో సాధారణ కనెక్షన్లు 4,82,664, దీపం కనెక్షన్లు 2,14,970, పీఎం ఉజ్వల యోజన కనెక్షన్లు 30,355, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కనెక్షన్లు 37,257 ఉండగా.. ఉచిత గ్యాస్ పొందేందుకు 5,05,831 మంది వినియోగదారులు అర్హులుగా పౌర సరఫరాల శాఖ నిర్ధారించింది. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా అర్హుల సంఖ్యనూ ప్రకటించింది. మిగిలిన 2,59,415 మందికి ఉచిత గ్యాస్ పథకం కింద వర్తించదనేది స్పష్టమవుతోంది.

హనుమా.. ఇక్కట్లు కనుమా!



కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం



ఆలయ ముందు భాగంలో ఉన్న పార్కుల్లోని చెత్తకుప్పలు



అద్దె గదులు దొరక్క పార్కులోనే సేదతీరుతున్న భక్తులు

కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి చెందిన నెట్టికంటి ఆంజనేయస్వామి కొలువు దీరిన కసాపురం దేవస్థానంలో భక్తులు అడుగడుగునా ఇబ్బందులకు గురవుతున్నారు. ఆలయంలో అద్దె గదుల కొరత తీవ్రంగా ఉండటంతో నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఓవైపు చలి, మరోవైపు దోమల బెడదతో రాత్రంతా జాగారం చేస్తున్నారు.

- నెట్టికంటుడి సన్నిధిలో భక్తుల పాట్లు
- వసతుల లేమితో అగచాట్లు
- చెత్త కుప్పలతో నిండిన ఆలయ పరిసరాలు
- అద్దె గదుల కొరతతో ఆరుబయటే భక్తుల నిద్ర

గుంతకల్లు రూరల్: ఏటా రూ.10 కోట్లకు పైగా ఆదాయం కలిగిన కసాపురం దేవస్థానంలో భక్తులకు కల్పించే సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. సాధారణ రోజుల్లో స్వామి వారిని దర్శించుకునే భక్తుల సంఖ్య వెయ్యి నుంచి 2 వేల వరకూ ఉంటుండగా, మంగళ, శనివారాల్లో మాత్రం 5 వేల మందికి పైగా భక్తులు తరలి వస్తారు. శ్రావణమాసం, కార్తీక మాసాల్లో ఈ సంఖ్య పది వేలకు పైమాటే.

గదులేవీ..?

భారీగా భక్తుల రద్దీ ఉన్న కసాపురం ఆలయంలో వసతి గదుల సదుపాయం మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ఆలయంలో దాదాపు 105 వసతి గదులు ఉన్నాయన్నమాటే గానీ అందులో కనీసం సగం అద్దె గదులు అందుబాటులో లేవు. రూ.40 అద్దె వసూలు చేసే రామ సదనం, లక్ష్మణ సదనంలో 39 గదులు ఉండగా అందులో 7 గదులు మినహా మిగతా అన్నీ శిథిలావస్థకు చేరాయి. దీంతో వాటిని మూసివేశారు. రూ.500 అద్దె కలిగిన కేసరి సదనంలో 30 గదులు ఉండగా అందులో రెండింటిలో బ్యాంకును ఏర్పాటు చేశారు. మరో రెండు శిథిలావస్థకు చేరడంతో మూసివేశారు. 26 గదులను మాత్రమే భక్తులకు కేటాయిస్తున్నారు. గంగా నిలయం ప్రాంగణం, నూతనంగా నిర్మించిన రామ దూత నిలయంలో మరో 36 అద్దె గదులు (ఏసీ, నాన్ ఏసీ) ఉన్నప్పటికీ వాటి అద్దె రూ.1,000 నుంచి రూ.1,500 వరకూ ఉండటంతో సామాన్య భక్తులు అంత డబ్బు చెల్లించలేని పరిస్థితి. ఈ క్రమంలో కేసరి సదనంలోని 26 అద్దె గదులు ఏమాత్రం సరిపోక, ప్రత్యామ్నాయం లేక ఆలయ ప్రాంగణం, ఆలయ ప్రధాన గోపురం ముందు భాగంలో ఏర్పాటు చేసిన పార్కుల్లోనే రాత్రిపూట నిద్రిస్తున్నారు.

ఎటు చూసినా దుర్గంధం..

భక్తులు ఆలయ పరిసరాల్లో నిద్రిస్తున్నారన్న విషయం తెలిసినప్పటికీ ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడంపై అధికారులు దృష్టి సారించడం లేదు. పార్కులు చెత్త కుప్పలకు నిలయంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. అయినా, గత్యంతరం లేని భక్తులు అక్కడే నిద్రిస్తున్నారు. దీనికి తోడు విపరీతమైన చలి, దోమల బెడదతో రాత్రంతా అల్లాడిపోతున్నారు.

అటకెక్కిన మాస్టర్ ప్లాన్..

భక్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మాస్టర్ ప్లాన్ అమలుకు అనుమతులు తీసుకువచ్చారు. పాలకమండలి సభ్యులతో కలిసి పలుమార్లు దేవదాయ శాఖ కమిషనర్, మంత్రులను కలిశారు. ఈ క్రమంలో మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుడుతూ ఆ పనులను ద్రోణ కన్సల్టెన్సీకి దేవదాయ శాఖ కమిషనర్ అప్పగించారు. ఈ క్రమంలోనే సదరు కన్సల్టెన్సీ వారు రెండు పర్యాయాలు ఆలయానికి వచ్చి పరిశీలించారు. అంతా సవ్యంగా జరుగుతోందన్న తరుణంలో ప్రభుత్వం మారడంతో మాస్టర్‌ప్లాన్ అటకెక్కింది.

రాత్రంతా జాగారం..



ముగ్గురు చిన్న పిల్లలతో కలిసి ఏడుగురు కుటుంబ సభ్యులం వచ్చాం. శనివారం అయితే రూము దొరకదని శుక్రవారం రాత్రికే ఇక్కడికి వచ్చాము. రూము అడిగితే అద్దె గదులు ఖాళీ లేవన్నారు. ప్రైవేటు అద్దె గదులేమో రూ.1,500 చెబుతున్నారు. చలి ఎక్కువైంది, దానికి తోడు దోమలు కూడా పెరిగిపోయాయి. దీంతో పిల్లలను కాపాడుకోవడానికి రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది.

– నాగేంద్ర, బత్తలపల్లి

గదులు ఖాళీ లేవంటున్నారు



ఆంజనేయస్వామి మా ఇంటి దేవుడు. కుటుంబమంతా కలిసి ప్రతి మూడు నెలలకోసారి వచ్చి స్వామిని దర్శించుకొని ఇక్కడే నిద్ర చేస్తాం. ఎప్పుడు వచ్చినా అద్దె గదులు ఖాళీగా లేవు అంటారు. గత్యంతరం లేక పార్కులోనో, ఆలయ పరిసరాల్లోనో పడుకోవాల్సి వస్తోంది. ఇంత పెద్ద దేవాలయంలో భక్తులకు అవసరమైన అద్దె గదులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడాల్సివస్తోంది.

– ఆంజనేయులు, ధర్మవరం

పార్కుల నిండా చెత్తే



స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు అద్దె గదులు దొరక్క ఆలయ పరిసరాల్లోనే పడుకుంటారని ఆలయ అధికారులకు తెలుసు. అయినా పరిసరాలను ఇంత అధ్వానంగా ఎందుకు ఉంచుతున్నారో తెలియదు. పేరుకు పార్కే అయినా నిండా చెత్త నిండిపోయింది. పశువులు ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. ఆలయ పరిసరాల్లో సేకరించిన చెత్తను పార్కులో డంప్ చేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది.

– సుధాకర్, తులసాపురం

చినుకు పడితే కిలోమీటర్ దూరం వరకూ షాక్

పుట్లూరు: చిన్నపాటి వర్షం కురిసినా... కిలోమీటర్ దూరం వరకూ ఉన్న పచ్చని చెట్లు, పొదలు షాక్ కొడుతున్నాయి. ఇందుకు గల కారణాలపై విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి అన్వేషణ చేపట్టలేదు. అయితే ఆందోళన చెందిన రైతులు మాత్రం విద్యుత్ షాక్‌కు గల కారణాలను పసిగట్టారు. పుట్లూరు మండలం కోమటికుంట్ల సమీపంలో ఉన్న గాలి మరల నుంచి విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా స్తంభాలను ఏర్పాటు చేసి, తీగలు లాగారు. వీటిలో కొన్ని స్తంభాలకు పిచ్చి చెట్ల తీగలు అల్లుకుని పైనున్న విద్యుత్ లైన్‌ను తాకుతున్నాయి. ఈ క్రమంలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు విద్యుత్ లైన్ నుంచి కరెంట్ తడిసిన చెట్ల తీగల ద్వారా పొలాల్లోని చెట్లకు వ్యాపిస్తోంది. ఇలా ఓ కిలోమీటర్ దూరం వరకూ చెట్ల ద్వారా కరెంట్ సరఫరా అవుతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు

హర్యానా మద్యం సీజ్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

అనంతపురం: నగరంలోని పాతూరు తాడిపత్రి బస్టాండ్ వద్ద ఆదివారం వైఎస్సార్ జిల్లా తొండూరు మండలానికి చెందిన వినయ్‌కుమార్‌రెడ్డి, గార్లదిన్నె మండలం కనంపల్లికి చెందిన రాజా మద్యం బాటిళ్లు తరలిస్తూ పట్టుబడ్డారు. వీరి నుంచి హర్యానా రాష్ట్రానికి చెందిన 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ తెలిపారు.

వృద్ధులకు పింఛన్ పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..

బొమ్మనహాళ్: మండలంలోని సింగానహళ్లి గ్రామంలో వృద్ధులకు ఎట్టకేలకు పింఛన్ డబ్బు పంపిణీ చేశారు. సింగానహళ్లి గ్రామానికి చెందిన దాదాపు 15 మంది లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించుకొని వృద్ధాప్య పింఛన్ డబ్బు ఇవ్వకుండా గోనేహాళ్ గ్రామ సచివాలయ ఉద్యోగి రమేష్ వెళ్లిపోయాడు. ఈ అంశంపై 'ఉద్యోగి ఏడిపింఛన్' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూ.53 వేల పింఛన్ డబ్బును ఆదివారం ఉదయం స్థానిక సర్పంచ్ కృష్ణ సమక్షంలో సచివాలయ ఉద్యోగి రమేష్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తాను అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాల్సి రావడంతో పంపిణీలో జాప్యం చోటు చేసుకుందని, మరోసారి ఇలాంటి ఘటనలకు ఆస్కారమివ్వనంటూ లబ్ధిదారులు ఫకీరమ్మ, చాకలి రుద్రమ్మ, భాగ్యమ్మ, మారెక్క, కెంచప్ప, వంద్రక్క, హరిజన దానప్ప, ఆంజనేయులు, బిడ్డ కెంచప్పతో తదితరులకు భరోసానిచ్చారు.



పింఛన్ డబ్బు పంపిణీ చేసిన దృశ్యం



'అనంత'లో శ్రీకాంత్

చలనచిత్ర నటుడు శ్రీకాంత్ ఆదివారం అనంతపురంలో సందడి చేశారు. నగరంలో ఓ రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి హాజరైన ఆయనను చూడగానే అభిమానులు కేరింతలు కొట్టారు. శంకర దాదా ఎంబీబీఎస్ చిత్రంలో ఏటీఎం పాత్రలో తనదైన విభిన్న నటనతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన తీరును ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

యువకుడి బలవన్మరణం

అనంతపురం: నగరంలోని రాజీవ్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీరాములు కుమారుడు శివ(30) ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన మేరకు.... ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎస్‌హెచ్‌జీ మహిళలకు టీడీపీ సభ్యత్వం!

- ఓ ప్రజాప్రతినిధి అల్టిమేటం
- లబోదిబోమంటున్న ఆర్‌పీలు

అనంతపురం కార్పొరేషన్: మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో టీడీపీ సభ్యత్వ నమోదు చేయించాలంటూ ఆర్‌పీలకు అనంతపురం నగర పరిధిలో ఓ ప్రజాప్రతినిధి అల్టిమేటమ్ జారీ చేయడం వివాదాస్పదమవుతోంది. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలన్న లక్ష్యంతో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.లక్షల్లో రుణాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇవ్వడమే కాక నవరత్నాల పథకాల్లో భాగంగా వివిధ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ వచ్చింది. ఇంట్లో మహిళ చేతికి నేరుగా డబ్బు అందితే పొదుపుగా వాడుకుంటుందని, తద్వారా ఆ కుటుంబం ఆర్థిక పురోగతి సాధిస్తుందని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. ఆయన సంకల్పం వృథా కాలేదు. విప్లవాత్మక సంస్కరణలతో మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు గణనీయమైన ఆర్థిక ప్రగతి సాధించారు.

నేడు అన్నింటికీ మహిళలే టార్గెట్..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మహిళల ఆర్థిక వనరులపై దెబ్బ పడుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి తల్లికి వందనం పథకం కింద ప్రతీ స్కూల్ విద్యార్థికీ రూ.15వేలు ఇస్తామని, ఒక ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికీ ఇస్తామని, ఇలా ఇంటర్ వరకూ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీనిచ్చిన కూటమి పెద్దలు.. అధికారం చేపట్టిన తర్వాత ఈ పథకం గురించి స్పష్టత ఇవ్వలేకపోయారు.



ఇక వడ్డీ లేని రుణాలు, ఇతర అంశాలపై కూడా మహిళలకు కూటమి సర్కార్ భరోసా నివ్వలేకపోతోంది. దీంతో మహిళల ఆర్థిక వనరులపై భారీగా దెబ్బ పడుతోంది.

తాజాగా సభ్యత్వం తప్పనిసరి..

మహిళా సంఘాల సభ్యులు టీడీపీ సభ్యత్వాన్ని కచ్చితంగా కలిగి ఉండాలని, ఆ దిశగా అందరితోనూ సభ్యత్వం నమోదు చేయించాలంటూ అనంతపురం నగర పరిధిలో ఓ ప్రజాప్రతినిధి అల్టిమేటం జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. తాను లక్ష మందితో సభ్యత్వం చేయిస్తానంటూ పార్టీ అధిష్టానం ఎదుట బీరాలు పోయిన సదరు ప్రజాప్రతినిధి.... క్షేత్ర స్థాయిలో ఆ స్థాయిలో సభ్యత్వ నమోదు చేయలేక చతికిలబడ్డారు. దీంతో ఎలాగైనా పరువు కాపాడుకోవాలని భావించిన ఆయన... చివరకు మహిళా సంఘాల సభ్యులను బలి పశువులను చేసేందుకు సిద్ధమైనట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అనంతపురం నగర పరిధిలో మొత్తం 4,035 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఇందులో మొత్తం 40,755 మంది సభ్యులు ఉన్నారు. 124 మంది ఆర్‌పీలు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనంతపురం నియోజకవర్గ పరిధిలో పది వేల నుంచి 15 వేల వరకు మాత్రమే టీడీపీ సభ్యత్వం నమోదైనట్లుగా తెలుస్తోంది. దీంతో మహిళా సంఘాల్లోని ప్రతి సభ్యురాలికి టీడీపీ సభ్యత్వం అంటగట్టాలంటూ ఆర్‌పీలకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. అయితే నేరుగా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టలేక కొత్తగా ఇన్సూరెన్స్ నాటకానికి తెరతీసినట్లు తెలుస్తోంది. మహిళా సంఘాల్లోని సభ్యులకు గతంలోనే ఇన్సూరెన్స్ చేయించారు. తాజాగా ఇన్సూరెన్స్ పేరుతో సభ్యులందరినీ ఒకే వేదికపై తీసుకువచ్చి గుట్టు చప్పుడు కాకుండా టీడీపీ సభ్యత్వం నమోదు చేయించే కుట్ర సాగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కొందరు మహిళల నుంచి వ్యతిరేకత రావడంతో తాము ఇబ్బంది పడాల్సి వస్తుందని కొందరు ఆర్‌పీలు వాపోతున్నారు.

అనంతపురం నగర పాలక సంస్థలో మొత్తం డివిజన్లు	50
వార్డు సచివాలయాలు	74
మహిళా పొదుపు సంఘాలు	4,035
సంఘాల్లో సభ్యుల సంఖ్య	40,755
ఆర్‌పీలు	124

అలాంటిదేమీ లేదు

మహిళా సంఘాల సభ్యులకు టీడీపీ సభ్యత్వం అనే మాట అవాస్తవం. మహిళా సంఘంలోని సభ్యురాళ్లకు కొత్తగా మూడు రకాల ఇన్సూరెన్స్ స్కీంలు వచ్చాయి. వాటి కోసం ఏమైనా సభ్యురాళ్లతో ఆర్‌పీలు మాట్లాడుతుండవచ్చు.

– విశ్వజ్యోతి, పీడీ, మెప్మా

జాతీయ స్థాయి యోగా పోటీలకు 'అనంత' విద్యార్థులు

నెల్లూరు(టౌన్): జాతీయ స్థాయి యోగా పోటీలకు అనంతపురానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ – 14, 17 విభాగాల్లో నెల్లూరులోని దర్గామిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమైన 68వ రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ –2024 పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలను ట్రెడిషనల్, రిథమిక్, ఆర్టిస్టిక్ విభాగాల్లో నిర్వహించారు. వీటిల్లో పాయింట్లను ప్రామాణికంగా తీసుకుని బాలబాలికలను జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. ఆర్టిస్టిక్, రిథమిక్ నుంచి ఒక్కొక్కరిని, ట్రెడిషనల్ నుంచి ఐదుగురిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అండర్ – 17 బాలుర ట్రెడిషనల్ విభాగంలో అనంతపురానికి చెందిన ఎం.అశోక్‌కుమార్, సి.జ్యోతిమహేంద్ర ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

ఆంధ్రా క్రికెట్ జట్టులో చోటు



డి. చంద్రిక



బి. తేజస్విని

అనంతపురం: ఆంధ్రా అండర్–15 బాలికల క్రికెట్ జట్టులో ఉమ్మడి జిల్లాకు చెందిన డి.చంద్రిక, బి.తేజస్వినికు చోటు దక్కింది. 2024–25 సీజన్‌కు సంబంధించి అండర్–15 పోటీలు ఒడిశాలోని కటక్‌లో జరగనున్నాయి. ఇందులో ప్రాతినిధ్యం వహించనున్న ఆంధ్రప్రదేశ్ జట్టులో వీరు చోటు దక్కించుకున్నారు. కాగా, అంతర జిల్లా మ్యాచ్‌ల్లో కుడిచేతి లెగ్ స్పిన్నర్‌గా, కుడి చేతి మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా చంద్రిక సత్తా చాటారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన బి.తేజస్విని కూడా కుడిచేతి మీడియం పేస్ బౌలింగ్‌లో రాణించారు. కుడిచేతి మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా అసమాన ప్రతిభ చాటి ఏపీ జట్టులో తన స్థానాన్ని పదిల పరుచుకున్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఇద్దరి ఎంపిక



ఎంపికైన జశ్వంత్, చంద్రమౌళి

అనంతపురం: ఈ నెల 4 నుంచి 16వ తేదీ వరకు చెన్నై వేదికగా జరిగే హాకీ ఇండియా సీనియర్ మెన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో అనంతపురం జిల్లాకు చెందిన జశ్వంత్, చంద్రమౌళికు చోటు దక్కింది. ఈ మేరకు అనంతపురం జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎస్. అనిల్‌కుమార్ ఆదివారం వెల్లడించారు.

డబుల్ సెంచరీతో మెరిసిన ప్రమోద్



దేవ్‌ప్రమోద్

అనంతపురం: అనంత క్రీడా గ్రామం వేదికగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–16 క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మ్యాచ్‌లను అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. టీం–ఎ, టీం–బీ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో టీం–ఎ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసి 266 పరుగులకు ఆలౌట్ అయింది. కేవీ ఓంకార్ 55 పరుగులు చేసి రాణించాడు. బి.మహిత్ 5 వికెట్లు తీసి తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. అలాగే టీం–సీ, టీం–డీ మధ్య జరిగిన మ్యాచ్‌లో టీం–డీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. పది వికెట్ల నష్టానికి 346 పరుగులు చేసింది. జట్టులో జి. దేవ్‌ప్రమోద్ 39 ఫోర్లతో 215 పరుగులు సాధించాడు.

పండగకొచ్చి... జలసమాధి



మహేష్ (ఫైల్)

పెనుకొండ: ఈత సరదా ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రాణాలు బలిగొంది. వివరాలు... పెనుకొండ నగర పంచాయతీలోని కోనాపురం గ్రామానికి చెందిన మహేష్ (36) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బెంగళూరులో స్థిరపడ్డారు. ఆయనకు భార్య ప్రవళిక, మూడేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. దీపావళి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి స్వగ్రామానికి వచ్చిన ఆయన... తన సోదరుడు రాజేష్, తల్లిదండ్రులు, వెంకటేష్, లక్ష్మీదేవమ్మ, భార్యాపిల్లలు, మరికొందరు సన్నిహితులతో కలసి కొత్తచెరువు మండలం బండ్లపల్లి పంచాయతీ కమ్మవారుపల్లిలోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం కమ్మవారుపల్లిలో బంధువుల ఇంట భోజనం ముగించుకుని రాజేష్, మరికొందరితో కలసి సరదాగా ఈత కొట్టేందుకు బండ్లపల్లి సమీపంలోని పుట్టపర్తి–పెనుకొండ రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకెళ్లారు. అండర్ బ్రిడ్జిలో ఉన్న నీటిలో ఈత కొడుతూ వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు నిర్మించిన సొరంగం వద్దకు చేరుకున్న మహేష్... అక్కడ నీటి ఉధృతికి సొరంగంలో ఇరుక్కుపోయాడు. గమనించిన తమ్ముడు రాజేష్... మహేష్‌ను వెలికి తీసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అక్కడున్న వారి కేకలు విన్న అటుగా వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్ వెంటనే స్పందించి సొరంగంలో చిక్కుకున్న మహేష్‌ను వెలికి తీశాడు. అప్పటికే ఆయన ఊపిరాడక మృతి చెందినట్లుగా నిర్ధారణ కావడంతో కోనాపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై కొత్తచెరువు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

తలుపూరులో వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: వాల్మీకి మహర్షి ఆదర్శ ప్రాయుడు. ప్రతి ఒక్కరూ ఆ మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు సూచించారు. ఆదివారం మండలంలోని తలుపూరులో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామంలో యువతులు, మహిళలు జ్యోతులను తలపై ఎత్తుకుని ఊరేగించారు. అనంతరం వాల్మీకి చిత్రపటానికి క్షీరాభిషేకం, పుష్పాభిషేకం చేపట్టారు. అనంతరం వాల్మీకులు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల్లో ఒక్కరైన వాల్మీకుల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వాల్మీకులందరూ ఏకతాటిపై నిలిచి హక్కులను సాధించుకోవాలన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలి



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న యువతులు

అనంతపురం కల్చరల్: అవినీతి రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని వక్తలు సూచించారు. ఎన్‌వైకే కార్యాలయంలో ఆదివారం నెహ్రూ యువకేంద్రం, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాతి భరత్, జయమారుతీ, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ డాక్టర్ ప్రణతి, డాక్టర్ గరుగు బాలాజీ తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. నేటి యువత అధికంగా ప్రయివేటు రంగంలో స్థిరపడుతున్న అవినీతిపై పోరాటం సాగించి సమాజంలో మార్పు తేవాలన్నారు. లంచం ఇవ్వడం ఎంత నేరమో ప్రోత్సహించడం అంతే నేరమన్న విషయాన్ని తెలియజేసి టోల్‌ఫ్రీ నంబర్ కల్గి ఉండేలా అవగాహన పెంచాలన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, మెడల్స్ అందించారు. వక్తలు మాట్లాడుతూ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రిసెల్లా, ఎర్రిస్వామి, నందిత, దేవహర్ష తదితరులు పాల్గొన్నారు.

అనంత వాసులకు ఉత్తమ సేవా పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న రచయిత చొప్పా వీరభద్రప్ప

అనంతపురం కల్చరల్: సాహితీ, సేవా రంగాల్లో విశేష కృషి చేస్తున్న అనంత వాసులు చొప్పా వీరభద్రప్ప, విజయసాయి కుమార్ ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రజని, లయన్ డాక్టర్ విజయకుమార్, కవి బిక్కీ కృష్ణ, ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ నరసింహప్ప ముఖ్య అతిథులుగా విచ్చేసి వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఘనంగా సత్కరించారు. అనంత వేదికగా చొప్పా వీరభద్రప్ప సాహిత్య కృషిని, విజయ్‌కుమార్ సేవా కార్యక్రమాలను అభినందించారు.

భక్తిమార్గంతోనే ప్రశాంత జీవనం



ప్రసంగిస్తున్న మల్లాది రామనాథ శర్మ

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మికత, భక్తిమార్గం మానసిక జీవితాన్ని ప్రసాదిస్తాయని ప్రముఖ ప్రవచన కర్త మల్లాది వేంకట రామనాథ శర్మ అన్నారు. నగరంలోని శ్రీశృంగేరీ శంకర మఠం వేదికగా ఈ నెల 3 నుండి 9వ తేదీ వరకు సాగనున్న 'భాగవత సప్తాహం' ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. జగద్గురు భారతీతీర్థ మహాసన్నిధానం వారి సన్యాసాశ్రమ స్వీకార మహోత్సవాల సందర్భంగా పీఠం ఆస్థాన పండితుడు పౌరాణిక సార్వభౌమ బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖరశాస్త్రి జయంతి ఉత్సవాలు అంతటా ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా అనంతకు రావడం ఆనందంగా ఉందని ప్రవచన కర్త మల్లాది వేంకట రామనాథ శర్మ తెలిపారు. అనంతరం శ్రీమద్భాగవతంలోని పలు ఘట్టాలను ఉపమాన సహితంగా వివరించారు. నిర్వాహకుడు సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ఏడు రోజుల పాటూ రోజు సాయంత్రం పురాణ ప్రవచనం ఉంటుందన్నారు. అంతకు ముందు మఠంలోని శ్రీ శారదా చంద్రమౌళీశ్వరులకు జరిగిన ప్రత్యేక పూజల్లో రామనాథశర్మతో పాటూ పలు ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల్లా కియోస్క్ యంత్రాలు

విత్తనం నుంచి పంట విక్రయం వరకు అన్నదాతలకు ప్రతి అడుగులో అండగా నిలబడాలని సదాశయంతో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అవసరమైన రైతులు వచ్చి సిబ్బందికి ముందస్తుగా నగదు చెల్లించాలి. అక్కడ కియోస్క్ యంత్రం ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఆ తర్వాత ఎవరికీ ఏ రకం కావాలో తెప్పించే పరిస్థితి ఉండేది. కేంద్రాల్లో అందుబాటులో లేని ఇంటర్‌నెట్, సాంకేతిక లోపాలతో చాలా చోట్ల కియోస్క్ యంత్రాలు పని చేయడం లేదు.

- సాంకేతిక లోపాలతో అందని సేవలు
- కార్యాలయాల్లో మూలకు పడేసిన వైనం



రైతు సేవా కేంద్రంలోని కియోస్క్ యంత్రం

రాప్తాడు: నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 74 రైతు భరోసా కేంద్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి కియోస్క్ యంత్రాలను కొనుగోలు చేసింది. ఈ యంత్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యవసాయ యంత్రాలు, రైతుల పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెట్ వివరాలు, తదితర అవసరమైన అన్ని సేవలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునే వీలుంది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయ శాఖ అన్ని విధాలా సేవలందించింది. వాతావరణ సామాచారం, వాతావరణంలో మార్పులు ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందు పరిచారు. నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు.. నేడు నిరుపయోగంగా ఉన్నాయి.

నిర్లక్ష్యపు నీడలు..

కూటమి ప్రభుత్వం హయాంలో రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాల వినియోగంపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. ప్రసుత్తం సాంకేతిక లోపంతో కియోస్క్ యంత్రాలు పని చేయడం లేదు. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుండగా కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని చోట్ల వీటిని పూర్తిగా విస్మరించడంతో విలువైన యంత్రాలు మూలన పడ్డాయి. మరి కొన్ని చోట్ల నెట్ సేవలు అందక పని చేయడం లేదు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తిస్థాయిలో పంపిణీ చేసేవారు. మరి ప్రస్తుతం మొక్కుబడిగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు అందిస్తున్నారు. రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నారు. రబీ సీజన్‌కైనా వీటిని సంపూర్ణంగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

కియోస్క్ యంత్రాలకు ఇంటర్ నెట్ సౌకర్యం అందుబాటులో లేదు. అక్కడ పని చేస్తున్న సిబ్బంది పలుమార్లు ఏఓ, ఏడీఏల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదు. నియోజకవర్గంలో రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, రామగిరి మండలాల్లో కియోస్క్ మిషన్లు పనిచేస్తున్నా వాటికి నెట్ సౌకర్యం లేకపోవడంతో ఆయా మండలాల్లో సిబ్బంది వాటిని మూలన పడేశారు. మొబైల్ ఫోన్లలో కియోస్క్ యాప్ వివరాలు నమోదు చేస్తున్నారు. కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో కియోస్క్ మిషన్లు పూర్తిగా పని చేయడం లేదు.

ఎరువులు పూర్తిస్థాయిలో ఇవ్వాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో అందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులను కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందించలేకపోయింది. గతంలో కియోస్క్‌లు ఉంటే అక్కడికి వెళ్లి ఎరువులను బుక్ చేసుకుని తెచ్చుకునే వాళ్లం. మా మండలంలో కియోస్క్ మిషన్లు పనిచేయడం లేదు. ఎరువుల కోసం ప్రైవెట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేశాం. గత వైఎస్సార్ ప్రభుత్వంలో మాదిరిగా రైతులకు అవసరమైన అన్ని ఎరువులూ అందించాలి. – మాధవ రెడ్డి, తగరకుంట, కనగానపల్లి మండలం

డిజిటల్ సేవలు అందించాలి



నాడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలలో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేవారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి, ఆమర్కెట్ వివరాలు వంటి సమాచారం రైతులకు డిజిటల్ సేవలు ద్వారా తెలియజేసేవారు. అప్పటిలాగే ఇప్పుడు కూడా కైతులకు డిజిటల్ సేవలు అందించాలి. – దొక్కా రామచంద్ర, గాండ్లపర్తి, రాప్తాడు మండలం

సమస్యలు పరిష్కరిస్తాం

నియోజకవర్గంలో రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో అన్ని రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు వినియోగంలోనే ఉన్నాయి. విత్తనాల కాలం అయిన తర్వాత వాటి వినియోగం తక్కువగా ఉంటుంది. రైతుల సౌలభ్యం కోసం మొబైల్ ద్వారా ఎక్కువ సేవలు అందుతున్నాయి. అందువల్ల వీటి వడకం తగ్గి ఉండవచ్చు. సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరిస్తాం. – రవి, ఏడీఏ అనంతరం

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10:30 గంటలకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' జరగనుంది. నగరపాలక సంస్థలోని వివిధ విభాగాలకు చెందిన సెక్షన్ హెడ్స్ అందుబాటులో ఉంటారు. నగర ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే వినతిపత్రాలు అందజేయవచ్చని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు.

ఫిర్యాదుల విభాగానికి హాజరుకండి

రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు అన్ని శాఖల అధికారుల హాజరుకావాలని తహసీల్దార్ విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అర్జీదారులు కార్యాలయానికి వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

పలాష్ రెస్టారెంట్ ప్రారంభం



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న హీరో శ్రీకాంత్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రేయస్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన ద టేస్ట్ ఆఫ్ పలాష్ (వెజ్, నాన్‌వెజ్) రెస్టారెంట్‌ను సినీ నటుడు శ్రీకాంత్ ఆదివారం ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన విలేకరులతో మట్లాడారు. నిర్వాహకుడు శ్రీకాంత్ రెడ్డి.. తనకు మిత్రుడని తెలిపారు. పలాష్ రెస్టారెంట్‌లో నాణ్యమైన రుచికరమైన వంటకాలు ఉంటాయని పేర్కొన్నారు. అంతకుముందు రెస్టారెంట్ వద్దకు వచ్చిన హీరో శ్రీకాంత్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

వేతనాల్లో కోత విధించడం తగదు



ఏఓ గిరిజా మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ ఎన్‌జీఓ ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం మెడికల్: ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు జాప్యం పేరుతో ఆరోగ్యశాఖలోని 91 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు వేతనాల్లో కోత విధించడం సరికాదని ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు మాధవ, చంద్రశేఖర్ రెడ్డి, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీధర్‌బాబు, అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆదివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వారు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఏఓ గిరిజా మనోహర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాంకేతిక పరమైన సమస్య కారణంతో ఎఫ్‌ఆర్‌ఎస్ జాప్యం జరిగిందని తెలిపారు. అందుకు చిన్న స్థాయి ఉద్యోగులకు భారీగా కోత విధించడం తగదన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌లో సర్వర్‌కు డేటా అనుసంధానం కాకపోవడంతోపాటు మహిళా ఉద్యోగులకు అదనంగా ఉన్న స్పెషల్ క్యాజువల్ లీవులు ఎఫ్‌ఆర్‌ఎస్‌లో చూపకపోవడంతో సెలవులు ఎక్సీడ్ కావడం జరిగిందన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌లో సెలవు యాడ్ చేసినప్పుడు యాక్సప్ట్ కొట్టడం ఆలస్యం కావడంతో గైర్హాజరును చూపి వేతనాల కోత విధించడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ నాయకులు శ్రీనివాస్ కుమార్, జమీలా బేగం, హంస వేణుగోపాల్, ఏపీఎన్‌జీఓ తాలూకా అధ్యక్షులు అక్కులప్ప, శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఈఓ సంఘం జాఫర్ మొహిద్దీన్, త్యాగరాజు, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ శర్మ, మస్తాన్, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు జయవర్ధన్ రెడ్డి, మహేష్ రెడ్డి, ఖాదర్, సత్యనారాయణ, శివకుమార్, నాగరాజు, నాగమణి, ఖాజాబీ పాల్గొన్నారు.

'చిన్నారుల్లో నైతిక విలువలు పెంచాలి'



ప్రార్థనల్లో పాల్గొన్న వైఎస్ విమలమ్మ

అనంతపురం కల్చరల్: చిన్నారుల్లో నైతిక విలువలు పెంచేందుకు అందరూ కృషి చేయాలని చిల్డ్రన్ సండే స్కూల్ చైర్మన్ వైఎస్ విమలమ్మ అన్నారు. ఆదివారం నగరంలోని సీఎస్‌ఐ చర్చిలో సండే స్కూల్ వార్షికోత్సవం కనుల పండువగా సాగింది. పాస్టర్ బెన్‌హర్ బాబు ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి వైఎస్ విమలమ్మ వాక్యోపదేశం చేశారు. బైబిల్‌లో పలు ఘట్టాలను ఆసక్తికరంగా వినిపించారు. చిన్నారులకు బాల్యం నుంచే బాధ్యతలు తెలిసేలా పెంచాలన్నారు. నైతిక బాట, దైవమార్గం విశిష్టతలను చిన్నతనం నుంచే నేర్చుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ఆటపాటలతో అందరినీ ఆకట్టుకున్నారు. ప్రతిభ చూపిన పిల్లలను ముఖ్య అతిథులు అభినందించారు. అనంతరం సంఘం పెద్దలు సుధీర్, జడ్ దేవరాజు, చంద్రశేఖర్, దేవ ప్రసాద్, సునీల్ కుమార్ తదితరులు వైఎస్ విమలమ్మను ఘనంగా సత్కరించారు.

స్త్రీ జాతి ఔన్నత్యాన్ని కాపాడుకుందాం



చిత్రయూనిట్‌ను అభినందిస్తున్న టీవీ నటులు, సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్: స్త్రీ జాతి ఔన్నత్యాన్ని కాపాడుకుందామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్ మ్యాక్స్ థియేటర్‌లో అవార్డు చిత్రాల దర్శకుడు తరిమెల రాజు, జంగం శ్రీనివాస్ సంయుక్తంగా నిర్మించిన 'ప్రశ్న' లఘుచిత్రం ఉచితంగా ప్రదర్శించారు. సీనియర్ రచయిత తరిమెల అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, అబ్బా టీవీ డాక్టర్ హరిప్రసాద్, సామాజిక సేవా కార్యకర్తలు కేపీ రాజు, రవికాంత్ రమణ, సినీ, బుల్లితెర నటుడు రమేష్ నీల్, ఆశ్రయ కృష్ణారెడ్డి తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. కడుపులో ఆడపిల్ల ఉందని తెలియంగానే సమాజం సహజంగా చూపే నైరాశ్యం అమానవీయమన్నారు. వాస్తవానికి మగపిల్లల జననానికి ఎవరు కారకులో తెలియజేసే గొప్ప మెసేజ్ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకుని ప్రశంసలు పొందిన చిత్రానికి జాతీయ అవార్డు వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం చిత్ర బృందాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు రమేష్ బాబు, సపారె రాజశేఖర్, తోట నాగరాజు, టీవీరెడ్డి, రియాజుద్దీన్, రంగస్థల రచయితలు ఎల్‌ఐసీ మురళీ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5న హైందవ శంఖారావం



పోస్టర్లను విడుదల చేస్తున్న హిందూ సంస్థల ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: హిందువులందరిని ఏకం చేసి ధర్మపోరాటం చేయడమే లక్ష్యంగా విశ్వహిందూ పరిషత్ హైందవ శంఖారావాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ యుగంధర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గీతామందిరంలో హైందవ శంఖారావం పోస్టర్లను పలు హిందూ సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. జనవరి 5న విజయవాడలో అతి పెద్ద ఎత్తున శంఖారావం పేరిట లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. అనంత నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. దేవాలయాల్లో అవినీతి, దేవదాయ శాఖ పరిధిలో రాజకీయాలతో పలచనవుతున్న హిందుత్వాన్ని పోరాటం ద్వారానే రక్షించుకుందామన్నారు. దేవాలయాల నిర్వహణను ప్రభుత్వాలు అసమర్థంగా నిర్వహిస్తుండటం వల్లే దేవుని మాన్యం అన్యాక్రాంతమవుతోందని మండిపడ్డారు. దేవాలయాల ఆదాయాన్ని కేవలం ధార్మిక కార్యక్రమాలకు ఉపయోగించాలని సూచించారు. ప్రజా అవసరాలకు వాడటం హిందువులను దోచుకోవడమేనని ఆరోపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రత్నమయ్య, రమణ, విశ్వేశ్వరరెడ్డి, రాక్టర్ రామ్మూర్తి, విశ్వనాథరెడ్డి, పరుచూరు రమేష్ బీజేపీ జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాస్, సుదర్శన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నూతన కార్యవర్గాల ఎన్నిక



రెవెన్యూ ఉద్యోగుల సంఘం కలెక్టరేట్ యూనిట్ నూతన కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్: రెవెన్యూ ఉద్యోగుల సంఘం కలెక్టరేట్ యూనిట్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ తహసీల్దార్ శ్రీధర్ వ్యవహరించారు.

నూతన కమిటీ ఇలా..

కలెక్టరేట్ యూనిట్ నూతన కమిటీ అధ్యక్షుడిగా తుపాకుల హరిప్రసాద్ (డీటీ), కార్యదర్శిగా దాసరి భరత్ కుమార్ (జేఏ), కోశాధికారిగా శ్రీలక్ష్మి (డీటీ) ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షురాలిగా వాణిశ్రీ (తహసీల్దార్), ఉపాధ్యక్షురాలిగా అనురాధ (డీటీ), లీలాకాంత్ (డీటీ), జిలాన్ బాషా (జేఏ), కార్యనిర్వాహక కార్యదర్శిగా పవన్ కుమార్ (జేఏ), సంయుక్త కార్యదర్శులుగా ఈశ్వర్‌రడ్డి (జేఏ), ఉదయ్‌కుమార్ (ఆఫీస్ సబార్డినేట్), అక్రమ్ (ఆఫీస్ సబార్డినేట్) ఎన్నికయ్యారు.



అనంతపురం డివిజన్ నూతన కమిటీ సభ్యులు

అనంత డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం అర్బన్: రెవెన్యూ ఉద్యోగుల సంఘం అనంతపురం డివిజన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక కృష్ణకళా మందిర్‌లోని సంఘం కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా శింగనమల తహసీల్దార్ బ్రహ్మయ్య వ్యవహరించారు.

నూతన కమిటీ సభ్యులు..

రెవెన్యూ ఉద్యోగుల సంఘం అనంతపురం డివిజన్ అధ్యక్షుడిగా శ్రీనివాసమూర్తి, అసిసోసియేట్ అధ్యక్షుడిగా రజాక్‌వలి, క్యాదర్శిగా పి.నారాయణ స్వామి, కోశాధికారిగా ఎ.మంజూనాథ్, ఉపాధ్యక్షులుగా సూర్యప్రతాప్, బాలమ్మ, కరుణాకర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సందీప్ కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా దివాకర్‌రెడ్డి, నాగేంద్ర, శ్రీనాథ్ ఎన్నికయ్యారు.

నేటి నుంచి కార్తీక ఉత్సవాలు

- ముస్తాబైన గౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయం



అలంకరణలో గౌరి ప్రసన్నేశ్వర స్వామి

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో వెలసిన గౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 4వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ కార్తీక మాస ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రెసిడెంట్ రాజుల తిమ్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రెనాటి కొండా రెడ్డి పేర్కొన్నారు. 4వ తేదీ తెల్లవారుజామున 5:30 గంటలకు, సాయంత్రం 5:30 గంటలకు రుద్రాభిషేకం, 10వ తేదీన కాళీ భైరవాష్టమి సందర్భంగా సాయంత్రం 5:30 గంటలకు స్వామికి రుద్రాభిషేకం జరుగుతాయి. 11వ తేదీ తెల్లవారుజామున 5:30 గంటలకు, సాయంత్రం 5:30 గంటలకు రుద్రాభిషేకం, 13న మహా ప్రదోషం సందర్భంగా సాయంత్రం 5:30 గంటలకు ఆలయంలో స్వామికి, మహానందికి ఏకకాలంలో రుద్రాభిషేకం 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున 5:30 గంటలకు స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఉదయం 10 గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం 4 గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం 6 గంటలకు కోటి దీపోత్సవం, మహా దీపం, జ్వాలా తోరణం అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 18వ తేదీ తెల్లవారుజామున 5:30 గంటలకు, సాయంత్రం 5:30 గంటలకు రుద్రాభిషేకం, 19వ తేదీ సంకష్టహర గణపతి చతుర్థి సందర్భంగా సాయంత్రం 6 గంటలకు మహాగణపతికి అభిషేకం, 24న కాలభైరవాష్టమి సందర్భంగా సాయంత్రం 6 గంటలకు రుద్రాభిషేకం, 25వ తేదీ తెల్లవారుజామున 5:30 గంటలకు సాయంత్రం 5:30 గంటలకు రుద్రాభిషేకం జరుగుతాయి. 28న మహా ప్రదోషం సాయంత్రం 5:30 గంటలకు ఆలయంలో స్వామికి, మహానందికి ఏకకాలంలో రుద్రాభిషేకం, 29న శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా సాయంత్రం 6:30 గంటలకు అన్నాభిషేకం చేస్తారు.

లలితాదేవిని పూజిస్తే ఐశ్వర్యం..

కార్తీక పౌర్ణమి ఎంతో విశిష్టమైన రోజు. ఆ రోజున ఉసిరి దానం చేయడం వలన దారిద్ర్యం తొలగిపోతుంది. పౌర్ణమి రోజున శివుడికి అభిషేకం చేయడం వల్ల ఆయుష్షు పెరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. కార్తీక పౌర్ణమి రోజు లలితాదేవిని సమస్రనామాలతో పూజిస్తే సకల ఐశ్వర్యాలు లభిస్తాయి. తులసి మొక్కలతో పాటు ఉసిరి కొమ్మను పెట్టి పక్కన రాధాకృష్ణుల విగ్రహాన్ని ఉంచి పూజిస్తే పెళ్లికాని యువతులకు వివాహ ప్రాప్తి లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

ప్రజాధనం 'తుప్పు' పాలు

ఇక్కడ కనిపించే వాహనాలు, బీరువాలు, టేబుళ్లను చూసి ఇదేదో గుజిరి సామాను నిల్వ చేసే ప్రదేశం అనుకుంటే పొరపాటే. ఇవి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని దృశ్యాలు. వినియోగించేందుకు కొత్త వాహనం వస్తే పాత వాహనానికి ఇక్కడి అధికారులు చెల్లుచీటి పెట్టేస్తారు. వాహనం ఎంత మంచి కండిషన్‌లో ఉన్నా మూలకు పడేస్తున్నారు. అలా ఒక క్వాలిస్, ఒక సుమో, ఆరు అంబాసిడార్ కార్లు, నాలుగు జీపులు మూలన పడేశారు. వాహనాలతో పాటు చాలా ఖరీదైన స్టాంపింగ్ మిషన్, బీరువాలు, టేబుళ్లను ఆరుబయట పడవేయడంతో అవి వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ ఎందుకు పనిరాకుండా తయారవుతున్నాయి. పాత వాహనాలు, సామగ్రిని ఇలా మూలకు పడవేసే బదులు వేలం ద్వారా విక్రయించే అవకాశం ఉన్నా.. ఆ దిశగా అధికారులు ఆలోచించడం లేదు.

– అనంతపురం అర్బన్



కలెక్టరేట్ వెనుక భాగంలో మూలకు పడేసిన వాహనాలు



తుప్పు పడుతున్న బీరువాలు, టేబుళ్లు



బయటపడేసిన స్టాంపింగ్ మిషన్, ఇతర వస్తువులు

రాష్ట్ర స్థాయి పోటీలకు కనగానపల్లి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ రమేష్



అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ మాధవరాజులు

కనగానపల్లి: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పలు క్రీడల్లో కనగానపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీనాథ్, అర్చన, రిషిత.. జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల పీడీ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్, పలువురు ఉపాధ్యాయులు వీరిని ప్రత్యేకంగా అభినందించారు. ఇక స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో (లాంగ్ జంప్) రేవంత్, హైజంప్‌లో హర్ష రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల మాధవరాజులు ఓ ప్రకటనలో తెలిపారు.